ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

బుధవారం 20 నవంబరు 2024

నేడు జిల్లా పోలీస్ కార్యాలయం ప్రారంభం



సిరిసిల్ల పట్టణం రగుడు చౌరస్తా సమీపంలో నిర్మించిన జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ (బంగ్లా) కార్యాలయం ఎట్టకేలకు ప్రారంభానికి సిద్ధమైంది. బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి వేములవాడ నుంచి వర్చువల్‌గా ప్రారంభించనున్నారు.

- సిరిసిల్ల క్రైం

న్యూస్ బాక్స్

యాసంగిలో ఆరుతడి పంటలు సాగు చేయాలి

తంగళ్లపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో వస్తున్న అధునాతన సాంకేతిక విధానాలను అందిపుచ్చుకోవాలని, యాసంగిలో ఆరుతడి పంటలను సాగు చేయాలని జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి సూచించారు. మంగళవారం జిల్లా ఏరువాక కేంద్రం కరీంనగర్ ఆధ్వర్యంలో గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా జగిత్యాల వ్యవసాయ కళాశాల విద్యార్థులు తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లిలో రైతు వేదికలో రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శనతో పాటు యాసంగి పంటల ప్రణాళికపై రైతులతో శాస్త్రవేత్తలు చర్చాగోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ రైతు పంట అవశేషాల యాజమాన్య పద్ధతులపై వివరించారు. రాబోయే యాసంగిలో రైతులందరూ ఆరుతడి పంటల సాగు చేపట్టాలని కోరారు. జిల్లా వ్యవసాయ అధికారిని అఫ్జల్ బేగం మాట్లాడుతూ రైతులందరూ మారుతున్న వాతావరణానికి అనుగుణంగా పంటల సరళిని మార్చాల్సిన అవసరం ఉందన్నారు. శాస్త్రవేత్తలు డాక్టర్ మధుకర్ రావు, డాక్టర్ రాజేంద్రప్రసాద్, మండల వ్యవసాయ అధికారి సంజీవ్, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

వస్త్ర పరిశ్రమపై వరాలు కురిసేనా..?



- 8 నెలల్లో 15 మంది కార్మికుల బలవన్మరణం
- నూలు డిపోతో కాస్త ఊరట
- స్వశక్తి చీరల ఆర్డర్లు వస్తేనే మగ్గాలు కదిలేది
- నేడు జిల్లాకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాక



(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

పొద్దస్తమానం పోగుపోగును పేని అందమైన రంగుల రంగుల చీరలు, బట్టలు నేసిన నేతన్నలు ఉపాధి కరువై అప్పుల్లో కూరుకుపోయారు. పడుగు పోగులు ఉరితాళ్లుగా వేలాడుతుంటే నిత్యం బతుకు చప్పుళ్లు వినిపించిన మరమగ్గాలు మూగబోయాయి. మళ్లీ బలిపీఠంపై నేతన్నలు నిలిచారు. చిన్న పిల్లలను అనాథలుగా మార్చి దంపతులు ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు పునరావృతం అయ్యాయి. గడిచిన ఎనిమిది నెలల్లోనే 15మంది కార్మికులు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వరస్వామిని దర్శించుకొని యారన్ డిపోతో పాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపైనే సిరిసిల్ల నేతన్నలు ఆశలు పెంచుకున్నారు. చితికిపోతున్న మరమగ్గాలకు మళ్లీ జవ సత్వాలు తెస్తాడని నమ్మకంగా ఉన్నారు. ఇప్పటికే వస్త్ర పరిశ్రమలో ఉపాధిని అందించే చర్యలు చేపట్టినా పూర్తి స్థాయిలో ఆర్డర్లు రాకపోవడంతో నేతన్నలకు ఎదురు చూపులే మిగిలాయి. దక్షిణాది రాష్ట్రాల్లోనే వస్త్రపరిశ్రమగా విరాజిల్లుతున్న సిరిసిల్ల మళ్లీ ఉత్పత్తుల కోసం ఎదురుచూస్తోంది. జిల్లాలో 30,352 మరమగ్గాలు ఉండగా 200 వరకు వార్పిన్‌లు, సైజింగ్‌లు, డైయింగ్‌లపై ప్రత్యక్షంగా పరోక్షంగా 20 వేల కార్మిక కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. దీంతో పాటు బద్దెనపల్లిలో టెక్స్‌టైల్ పార్కులో కూడా ఆధునిక మర మగ్గాలపై కార్మికులు ఉపాధి పొందుతున్నారు. టెక్స్‌టైల్ పార్కు పలు సమస్యల్లో కొట్టుమిట్టాడుతోంది. గతంలో అనేక సంక్షోభా లను ఎదుర్కొన్న వస్త్ర పరిశ్రమలో వందలాది మంది కార్మికులు చనిపోయారు. గత ప్రభుత్వం హయాంలో బతుకమ్మ చీరలు, కేసీఆర్ కిట్, రంజాన్, క్రిస్మస్ పర్వదినాల సందర్భంగా అందించే బట్టలతో పాటు ప్రభుత్వ సంస్థలకు అవసరమయ్యే ఉత్పత్తులను సిరిసిల్ల పరిశ్రమకు కేటాయించారు. దీంతో నిరంతరం కార్మికులకు పని దొరికింది. బతుకమ్మ..

మిగతా 8లో

సీఎం పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

- నేడు వేములవాడలో 'రాజన్న' దర్శనం.. బహిరంగ సభ
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- యారన్ డిపో ప్రారంభం
- గల్ఫ్ బాధితులకు ఆర్థికసాయం పంపిణీ

సిరిసిల్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజన్న క్షేత్రంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఎన్నో ఏళ్లుగా వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి, విస్తరణ పనులకు కదలిక మొదలైంది. బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు తొలిసారిగా ముఖ్యమంత్రి హోదాలో రానున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. భారీ బందోబస్తుతో పాటు వేములవాడ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకొని, బహిరంగ సభలో మాట్లాడతారు. సీఎం పర్యటన సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాల మళ్లింపు చేపట్టారు. భారీ బందోబస్తును నిర్వహిస్తున్నారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్‌లతో పాటు కాంగ్రెస్ ముఖ్య నాయకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి ఉదయం హెలికాప్టర్‌లో వేములవాడకు చేరుకోని ముందుగా రాజరాజేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. కోడె మొక్కులు చెల్లించుకుంటారు. అనంతరం ఇప్పటికే మంజూరైన రూ 127.65 కోట్లకు సంబంధించిన పనులకు శంకుస్థాపనలు చేస్తారు. రాజరాజేశ్వర ఆలయ కాంప్లెక్స్ విస్తరణ, భక్తులకు అవసరమైన అధునాతన సదుపాయాలకు రూ. 76 కోట్ల పనులకు శంకుస్థాపనలు చేస్తారు. రూ 47.85 కోట్లతో మూలవాగు బ్రిడ్జి నుంచి రోడ్ల వెడల్పునకు సంబంధించిన పనులు మూలవాగు బతుకమ్మ తెప్ప నుంచి జగిత్యాల కమాన్ వరకు మురికి కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేస్తారు. రూ. 50 కోట్లతో యారన్ డిపోను ప్రారంభిస్తారు. దీంతో పాటు వివిధ అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు. 17 గల్ఫ్ బాధిత కుటుంబాలకు ఐదు లక్షల చొప్పున రూ. 85 లక్షల ప్రొసీడింగ్‌లను అందజేస్తారు. రూ. 235 కోట్లతో మిడ్ మానేరు నిర్వాసితులకు నిర్మించే ఇందిరమ్మ ఇళ్ల పనులకు రూ. 166 కోట్లతో చేపట్టే మెడికల్ కళాశాల హాస్టల్ బ్లాక్ నిర్మాణాలకు, రూ. 35 కోట్లతో చేపట్టే అన్నదాన సత్రం పనులు, రూ. 52 కోట్లతో కోనరావుపేట మండలంలో చేపట్టే హైలెవల్ బ్రిడ్జి పనులకు శంకుస్థాపనలు చేస్తారు. సిరిసిల్లలో రూ 26 కోట్లతో నిర్మించిన జిల్లా ఎస్పీ కార్యాలయ భవనం, వేములవాడలో రూ 1.45 కోట్లతో నిర్మించిన గ్రంథాల య భవనం, రూ 4.80 లక్షలతో నిర్మించిన వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ భవనాన్ని ప్రారంభించనున్నా రు. 631 శివశక్తి మహిళ సంఘాలకు రూ 102 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలను పంపిణీ చేస్తారు. దేవస్థానం గుడిచెరువు మైదానంలో బహిరంగ సభకు ఏర్పాట్లు చేశారు.



వేములవాడలో సీఎం సభకు సిద్ధమైన సభా ప్రాంగణం



పోలీస్ బందోబస్తును పరిశీలిస్తున్న ఐజీ, ఎస్పీ

ముఖ్యమంత్రి పర్యటన ఇలా...

- ఉదయం 9.50 గంటలకు వేములవాడ దేవస్థానానికి చేరుకుంటారు.
- 9.55 నిముషాలకు పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తారు.
- 10గంటల నుంచి 10.15వరకు గెస్ట్‌హౌజ్‌లో ఉంటారు.
- 10.15 నుంచి 11 గంటల వరకు స్వామివారిని దర్శనం, ప్రత్యేక పూజలో పాల్గొంటారు.
- 11.15 నిముషాలకు ధర్మగుండం అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- 11.30 గంటలకు తిరిగి గెస్ట్‌హౌజ్‌కు చేరకుంటారు.
- 11.40 బహిరంగ సభ
- 12.30 నిముషాలకు గెస్ట్‌హౌజ్‌లో భోజనం
- మధ్యాహ్నం 1 గంటలకు తిరుగు ప్రయాణం అవుతారు.

● భారీ బందోబస్తు...

ముఖ్యమంత్రి వేములవాడ పర్యటన సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. 1,100 మంది పోలీసులు పటిష్ఠ బందోబస్తులో పాల్గొననున్నారు. బందోబస్తుకు సంబంధించి సెక్టార్‌లుగా విభజించి అడిషనల్ ఎస్పీ, డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులను బాధ్యులుగా నియమించారు. బందోబస్తులో ఎలాంటి లోపాలు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాల పార్కింగ్ కోసం ఏడు చోట్ల ఏర్పాట్లు చేశారు.

● పరిశీలించిన మల్టీజోన్-1 ఐజీ

వేములవాడ కల్చరల్ (ఆంధ్రజ్యోతి): వేములవాడలో సీఎం పర్యటన నేపథ్యంలో సభాప్రాంగణాన్ని మంగళవారం మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి పరిశీలించారు. చెక్‌పోస్టులను, బారీకెడ్లను పరిశీలించారు. సభకు వచ్చే ప్రజలను అంచానా వేసి వాటికి అనుగుణంగా పోలీసులు నడుచకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్, ఏఎస్పీ శేషాద్రినిరెడ్డికి సూచించారు.

వణికిస్తున్న చలి

- కనిష్ఠ ఉష్ణోగ్రత 12.2 నమోదు

సిరిసిల్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లాలో చలి వణికిస్తోంది. నాలుగు రోజులుగా ఎల్లో అలర్ట్‌గానే కొనసాగుతోంది. మంగళవారం జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రత 12.2 డిగ్రీలుగా నమోదైంది. గరిష్ఠ ఉష్ణోగ్రత 33.7 డిగ్రీలుగా ఉంది. ఉదయం వేళల్లో ప్రజలు బయటకు రావడానికి ఇబ్బందిపడ్డారు. ఎనిమిది గంటల వరకు ఎండ పెరగలేదు. జిల్లాలో రుద్రంగి మండలంలో 12.2 కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు అయింది. కాగా గంభీరావుపేటలో 12.8, వేములవాడలో 15.1, ఇల్లంతకుంటలో 14.3, వీర్నపల్లిలో 12.6, వేములవాడరూరల్‌లో 13.4, సిరిసిల్లలో 13.9, కోనరావుపేటలో 13.2, ఎల్లారెడ్డిపేటలో 13.3, తంగళ్లపల్లిలో 13.0, బోయినపల్లిలో 13.3, ముస్తాబాద్ 13.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఏసీబీ వలలో అంతర్గాం తహసీల్దార్

డబ్బులు పడేసి పారిపోయిన ఆర్ఐ



తహసీల్దార్ ఉయ్యాల రమేష్, బాధితుడు ఆలకుంట మహేష్

అంతర్గాం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అంతర్గాం తహసీల్దార్ ఉయ్యాల రమేష్‌తో పాటు ఆర్ఐ ఎగ్గిడి శ్రీధర్‌లు ట్రాక్టర్ ఓనర్ వద్ద రూ.12వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఏసీబీ అధికారులు, బాధితుడు ట్రాక్టర్ ఓనర్ ఆలకుంట మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 28న మండల పరిధిలోని లింగాపూర్ గోదావరినది సమీపంలో ట్రాక్టర్‌ను అంతర్గాం పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్ ఓనర్ ఆలకుంట మహేష్‌ను పోలీసులు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. జరిమానా రూ.50 వేలు చెల్లించాలంటూ తహసీల్దార్ రమేష్ చెప్పారు. తాను పేదవాడినని అన్ని డబ్బులు చెల్లించలేనని బాధితుడు మహేష్ వేడుకోగా సంబంధిత ఆర్ఐ శ్రీధర్‌ను కలవమని తహసీల్దార్ సూచించారు. దీంతో బాధితుడు ఆర్ఐని కలువగా రూ.12 వేలు డీడీ తీసి ఇవ్వడంతో పాటు మరో రూ.12వేలు అదనంగా ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు బాధితుడు రూ12వేల డీడీతోపాటు రూ.12వేల నగదును ఆర్ఐ శ్రీధర్‌కు ఇవ్వగా, ఆయన డబ్బులతో తహసీల్దార్ చాంబర్‌కు వెళ్లాడు. వెంటనే ఆఫీస్‌లోకి వచ్చిన ఏసీబీ అధికారులు తహసీల్దార్ రమేష్, ఆర్ఐ శ్రీధర్‌లను పట్టుకునేందుకు ప్రయత్నించగా డబ్బులు ఆఫీస్ బయట పడవేసిన ఆర్ఐ శ్రీధర్ తప్పించుకొని పరారయ్యాడు. దీంతో ఏసీబీ అధికారులు తహసీల్దార్ రమేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. అంతకు ముందు బాధితుడితో మాట్లాడిన తహసీల్దార్ రమేష్, ఆర్ఐ శ్రీధర్‌పై కేసు నమోదు చేసినట్లు ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. దాడులలో ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి, ఇన్‌స్పెక్టర్లు కృష్ణ కుమార్, తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.



బద్దిపోచమ్మ ఆలయం వద్ద భక్తుల కోలాహలం

బద్దిపోచమ్మకు

బోనాల మొక్కులు

దప్పుచప్పుళ్లు, శివసత్తుల నృత్యాలతో ఊరేగింపు

వేములవాడ కల్చరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి అనుబంధ ఆలయమైన బద్దిపోచమ్మ అమ్మవారికి భక్తులు బోనాల మొక్కులు చెల్లిం చుకున్నారు. సోమవారం రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం తెల్లవారు జామున అమ్మవారికి నైవేద్యాన్ని ఏర్పాటు చేసుకుని డప్పు చప్పుళ్ల మధ్య శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. నెత్తిన బోనాలతో గంటల తరబడి అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరారు. బద్దిపోచమ్మకు పట్నాలు వేసి ఒడిబియ్యం సమర్పించారు. అనంతరం అమ్మవారికి కల్లు సాక పెట్టి పిల్లాపాపలు, పాడిపంటలు చల్లంగా ఉండాలని వేడుకున్నారు.



బోనాలతో బారులు తీరిన భక్తులు

ఉద్యోగులపై దాడిని ఖండిస్తున్నాం

ఉద్యోగ జేఏసీ చైర్మన్, టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి

సుభాష్‌నగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కొంతమంది నాయకులు తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ఉద్యోగులపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఉద్యోగ జేఏసీ చైర్మన్, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక టీఎన్‌జీవో భవన్‌లో ఆయన మాట్లాడుతూ అమాయక ప్రజలను రెచ్చగొడుతూ తమ రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోయి అమలు చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులను బెదిరింపులకు గురి చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆ ప్రభుత్వం ఆదేశాలను ఉద్యోగులు పాటిస్తారన్నారు. తమ స్వంత ఆలోచనలు గాని, స్వంత ఎజెండా గాని ప్రభుత్వ ఉద్యోగులకు ఉండదని ఈ విషయాన్ని రాజకీయ పార్టీలు, రాజకీయ నాయకులు గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సంగెం లక్ష్మన్‌రావు, నాగులు నరసింహస్వామి, హరికృష్ణ, రాగి శ్రీనివాస్, గూడ ప్రభాకర్‌రెడ్డి, ముప్పిడి కిరణ్ కుమార్‌రెడ్డి, ఒంటెల రవీందర్‌రెడ్డి, గంగారపు రమేశ్, మహిళ ఉద్యోగుల ప్రతినిధులు శారద, సునీత, విజయలక్ష్మి, శైలజ, సర్దార్ హర్మిందర్‌సింగ్, జలాలుద్దీన్‌అక్బర్, గుంటి బిక్షపతి, అభిషేక్‌రెడ్డి, శంకర్, మన్మిత్‌సింగ్, హస్గర్ శ్రీనివాస్, కమలాకర్, నాల్గవ తర గతి ఉద్యోగుల సంఘం అధ్యక్షకార్యదర్శులు కోట రామస్వామి, శంకరయ్య, రాజేశ్వర్‌రావు, ఎల్లె శీను, వంశీ, బోనాల రవి, అజయ్, నారాయణ, వివిద ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా స్థాయి బీచ్ వాలీబాల్ పోటీలు

శంకరపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవపట్నం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల క్రీడా మైదానంలో ఉమ్మడి జిల్లా అండర్-14, అండర్-17 బాలబాలికల బీచ్‌వాలీబాల్ ఎంపిక పోటీలను ఎంఈవో లక్ష్మీనారాయణ మంగళవారం ప్రారంభించారు. ఈపోటీల్లో వివిధ పాఠశాల నుంచి వచ్చిన వందమంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుభాష్, పెట రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణ, హ్యాండ్ బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్రీను, మోడల్ స్కూల్ ప్రెసిడెంట్ అనూప్‌రెడ్డి పాల్గొన్నారు.

వృద్ధురాలి మృతదేహం వెలికితీత

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని దమ్మక్కపేటకు చెందిన కొండబత్తిని రాజేశ్వరి(65) సోమవారం బావిలో దూకగా, రెండు రోజుల పాటు గాలించిన పోలీసులు గ్రామస్థుల సహాయంతో మంగళవారం మృతదేహన్ని బయటికి తీశారు. రాజేశ్వరి భర్త రాజాకిషన్ 14సంవత్సరాల నుంచి పక్షవాతంతో బాద పడుతున్నారు. భర్త పరిస్థితిని చూసి మనోవేదనకు గురైన రాజేశ్వరి బావిలో దూకి ఆత్మహత్యకు చేసుకుంది. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రాజేశ్వరి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

బీర్‌పూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొల్వాయి గ్రామంలో సోమవారం గ్రామానికి చెందిన నల్ల గంగన్న ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమయింది. బాధి తులు గంగన్న కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ప్రమాదంలో 65వేల నగ దు, ముప్పావు తులంబంగారం, 25 తులాల వెండి పూర్తిగా కాలిపోయిందని విలపించారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ పరిశీలకులు శ్రీనివాస్ సంఘటన స్థలానికి చేరుకొని ప్ర మాద నష్టాన్ని అంచనా వేసి పై అధికారులకు నివేదించారు.

ఒకరిపై కేసు నమోదు

చొప్పదండి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈనెల 15న గాలిపెల్లి కనకయ్యకు చెందిన వస్త్ర దుకాణాన్ని పెట్రోల్‌పోసి నిప్పంటించిన కోడూరి శ్రీనివాస్ అనే వ్యక్తిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ అనూష మంగళవారం తెలిపారు. వస్త్ర దుకాణంలో మంటలు వ్యాపించగా ఆరులక్షల రూపాయల ఆస్తినష్టం వాటిల్లినట్లు వ్యాపారి కనకయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

విత్తన చట్టంలో మార్పులు, చేర్పులు చేస్తాం

రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి

జగిత్యాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో రైతులను విత్తన కంపెనీల నుంచి మోసాలకు గురికాకుండా విత్తన చట్టంలో మార్పులు, చేర్పులు చేసే విధం గా ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్తామని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్య క్షుడు అన్వేష్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని సమీ కృత కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న విత్తన చట్టంలో ఉన్న లొసుగుల వల్ల ప్రైవేటు కంపెనీలకు అనుకూలంగా ఉన్న పరిస్థితులున్నాయన్నారు. ప్రైవేటు కంపెనీల మోసాలకు గురికాకుండా ప్రభుత్వ విత్తన సంస్థ అందించే మేలు అయిన రకాల విత్తనాలను వినియోగించాలని రైతులను కోరారు. వివిద రకాల ప్రైవేటు కంపెనీలు పుట్ట గొడుగుల్లా పుట్టుకొచ్చాయన్నారు. రకరకాల ఆకర్షనీయమైన ప్రకటనలతో ఆకర్షించి సొంత వెరైటీ విత్తనాలను రైతులకు విక్రయించి ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. ప్రైవేటు విత్తనాల వల్ల రైతులు పంట నష్టపోతే పరిహారం అందించడం లేదన్నారు. కేవలం విత్తన పెట్టుబడులను మాత్రమే అందిస్తున్నారన్నారు. పంట ఉత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసే యోచన చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై కొందరు రకరకాల ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘ నాయకులు పిడుగు తిరుపతిరెడ్డి, సంజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యం

రాష్ట్రంలో రైతాంగానికి నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి అన్నారు. మంగళ వారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా వ్యవసాయ శాఖ, ప్రాథమిక వ్యవసాయ సంఘాల కార్య దర్శులు, వ్యవసాయ అధికారులతో యా సంగి 2024-25 పంట సీజన్ సందర్భంగా ప్రత్యే క సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రానున్న రోజుల్లో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ కార్యక్రమా లను మరింత ముమ్మరం చేస్తామన్నారు. నా ణ్యమైన విత్తనాలు అందించే విత్తనాభివృద్ధి సం స్థను సహకార సంఘాలు ప్రోత్సహించాలన్నా రు. జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత, డీసీఎం ఎస్ చైర్మన్ ఎలాల శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా సహకార అధికారి సీహెచ్ మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్‌పర్సన్ అసోసియేషన్ బాద్యులు, పాల్గొన్న పెన్షనర్లు

సుభాష్‌నగర్, నవబంరు 19(ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్ డిమాండ్ చేశారు. మంగళవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన పీఆర్‌సీని 2023 జూలై నుంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హత కలిగిన ఈపీఎస్ పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.15వేలు ఇవ్వాలని, ప్రతి జిల్లా కేంద్రంలో రెండు వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేసి, పెన్షనర్లు, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు కార్పోరేట్ స్థాయిలో వైద్యం అందించాలని కోరారు. గ్యాడ్యుటీని కేంద్ర ప్రభుత్వం మాదిరిగా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు రూ. 20లక్షలు చెల్లించాలని కోరారు. పెన్షనర్లు కూడా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారని, వారికి ప్రత్యేక ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు కట్ట నాగ భూషణాచారి, కోశాధికారి ఇరువంటి తిరుమలయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు బొంగోని వెంకటయ్య, గరిగ చంద్రయ్య, నల్ల ప్రభాకర్‌రెడ్డి, రాయికంటి రామకృష్ణయ్య, ఆర్‌టీసీమల్లయ్య చొల్లెటి మాల్లరెడ్డి, అరికాల చంద్రమౌళి, తాటిపాముల కనకయ్య, ఎస్ సారభద్రస్వామి, బి జగదీశ్వర్, కొండా రాజయ్య, ఎం గోపాల్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, ఊకంటి లక్ష్మీనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న పలువురి అరెస్టు

వివరాలు వెల్లడించిన మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి



ఎస్ఐ లక్ష్మారెడ్డి సిబ్బందితో వాహనాల

మెట్‌పల్లి టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గంజాయి అమ్మితే కఠినచర్యలు తీసుకుంటామని మెట్‌పల్లిసిఐ నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మండలం బండలింగపూర్ క్రాస్ రోడ్డు వద్ద గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు సిఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ బండలింగపూర్ రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా నెంబర్ ప్లేట్ లేని బైక్‌పై ముగ్గురు వ్యక్తులు వెళ్తుండగా ఆపి తనిఖీ చేయగా బైక్‌లో నల్లని కవరులో తీసు కెళ్తున్న గంజాయిని పట్టుకున్నాట్లు తెలిపారు.

వారి వద్ద నుండి 220 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నాట్లు తెలిపారు. గంజాయి తర లిస్తున్న మెట్‌పల్లికి చెందిన లోకిని వంశీ, కోయిల్కర్ రమేష్, లోకిని విగ్నేష్‌లను విచారించగా నిజామాబాద్ రైలులో నాందెడుకు వెళ్లి గతంలో పరిచయం ఉన్న అజార్ అనే వ్యక్తి వద్ద నుండి గంజాయి కోనుగోలు చేసి అక్కడి నుండి మెట్‌పల్లికి కోను గోలు చేసిన గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి 500 చొప్పున అమ్మెందుకు వస్తుండగా పట్టుకున్నాట్లు తెలిపారు. ముగ్గురు నిందితు లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి బైకు 3 సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకోని సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్, పోలీస్ సిబ్బంది సాదు నాయక్, సంతోష్‌లు ఉన్నారు.

● ఐదుగురు నిందితుల అరెస్టు

కరీంనగర్ క్రైం, (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం మొగ్ధుంపూర్ వద్ద మంగళవారం కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ లక్ష్మారెడ్డి సిబ్బందితో వాహనాల తనిఖీ నిర్వహించగా ఐదుగురు నిందితుల వద్ద కిలో 98 గ్రాముల గంజాయి పట్టుబడింది.

కరీంనగర్ రూరల్ పోలీసుల వివరాల ప్రకారం మొగ్ధుంపూర్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా రెండు బైక్‌లపై వస్తున్న ఐదుగురు వ్యక్తులు పోలీసులను చూసి బైక్‌లను అక్కడే వదిలిపెట్టి పారిపోయే ప్రయత్నం చేయగా వెంటనే అప్రమత్తమైన పోలీసులు ఐదుగురిని అదుపులోకి తీసుకుని సోదా చేయగా నిషేధిత గంజాయి పట్టుబడింది. అనంతరం వారిని విచారించగా మహారాష్ట్రలోని బల్లార్షలో కొనుగోలు చేసి తీసుకువస్తున్నట్లు వెల్లడైంది. పట్టుబడిన నిందితులు కుందనపల్లికి చెందిన మేకల మహేందర్(22), తొర్తి శశికుమార్(24), ఫకీర్‌పేట్ గ్రామానికి చెందిన కడప వంశీ(19), ఎండీ సాధాకత్ అలీ(20), నగునూర్‌కు చెందిన గద్దల శ్రీరాం(19)లను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి జడ్జి ఆదేశాల మేరకు జైలులో రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు.

నిధులు మంజూరై రెండేళ్లు

● పనులు ప్రారంభానికి ఎన్నేళ్లో ● లోలెవల్ కల్వర్టుతో ప్రయాణికులకు ఇక్కట్లు



లో లెవల్ కల్వర్టు

పెగడపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని చందంగా ఉంది పెగడపల్లి మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని లోలెవల్ కల్వర్టు పరిస్థితి. నిధులు మంజూరై రెండేళ్లు కావస్తున్నా నిర్మాణ పనులు ప్రారంభానికి మాత్రం మోక్షం లభించడం లేదు. పెగడపల్లి మండల కేంద్రం నుంచి గోపాల్‌రావుపేట వెళ్లే రోడ్డులో సబ్‌స్టేషన్ సమీపంలో లో లెవల్ బ్రిడ్జితో వర్షాకాలంలో బ్రిడ్జిపై నుంచి భారీగా వరద నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది దీంతో పాటు కల్వర్టు సైతం శిథిలా వస్థకు చేరుకోగా గత ప్రభుత్వం హయాంలోనే హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి గాను రూ. రెండు న్నర కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు టెండర్ ప్రక్రియ సైతం పూర్తయింది. నిధులు మంజూరు, టెండరు పూర్తయినా నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో ఆ రోడ్డు ద్వారా ప్రయాణించే ప్రయాణికులు కల్వర్టు దాటే వరకు భయం భయంగా ప్రయాణించాల్సి వస్తోంది. ఇప్పటికైనా స్థానిక శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జోక్యం చేసుకుని నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఆవుపై అడవి జంతువు దాడి

సైదాపూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన రైతు బాసవేని కుమార్‌కు చెందిన ఆవుపై సోమవారం రాత్రి గుర్తు తెలియని అడవి జంతువు దాడి చేసి గాయపరిచింది. రైతు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం సాయంత్రం తన వ్యవసాయ బావి వద్ద ఆవును కట్టేసి ఇంటికి వచ్చాడు. ఉదయం వెళ్లి చూసే సరికి ఆవు మెడ కింది ముందు కాలు వద్ద పెద్ద గాయమయ్యి ఉందని తెలిపాడు. వెంటనే పశువైద్యులకు సమాచారం ఇవ్వగా సిబ్బంది వచ్చి ట్రీట్‌మెంట్ చేశారన్నారు. ఆవుపై దాడి చేసింది హైనా అయి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లంతకుంట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాలిపెల్లి గ్రామ సమీపంలోని బిక్కవాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడిచేసినట్లు పేర్కొన్నారు. వాహనాన్ని స్వాధీనం చేసుకొని ఇసుకను తరలిస్తున్న బద్దం రమేష్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

అధ్వానంగా ఎస్సారెస్పీ కాలువలు



షట్టర్లు లేకుండా మిగిలిపోయిన తూములు

● పట్టించుకోని అధికారులు

● ఆందోళనలో రైతులు

పెగడపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎస్సారెస్పీ కాలువల మరమ్మతు లేక కాలువల ఆనవాళ్లు కోల్పోతున్నాయి. పెగడపల్లి మండలంలోని 23 గ్రామాలకు గాను నందగిరి, అయిత్‌పల్లి మినహా 21 గ్రామాలు శ్రీరాంసాగర్ ఆయకట్టు పరిధిలోనే ఉండగా కాలువ నీరు వస్తేనే పంటలు పూర్తి స్థాయిలో పండేది. కాగా మండలంలోని పలు డిస్ట్రిబ్యూటరీ కాలు వలను ఎన్నో ఏండ్ల కింద సిమెంట్ లైనింగ్ చేయగా అప్పటి నుంచి వాటి మరమ్మతు, పూడిక తీత పనులపై పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు.

దీంతో దాదాపు అన్ని డిస్ట్రిబ్యూటరీ కాలువలు పిచ్చిమొక్కలతో నిండిపోవడమే కాకుండా సిమెంట్ లైనింగులు కూలిపోయి, తూముల షట్టర్లు ఊడిపోయి కాలువల ఆనవాళ్లు కనిపించకుండా పోయాయి. ఎస్సారెస్పీ ప్రాజెక్టులో సమృద్ధిగా నీరు ఉంది. రెండవ పంటకు మరి కొద్ది రోజుల్లో నీరు వదిలే పరిస్థితులుండగా కాలువల మరమ్మతు పూడికతీత పిచ్చిమొక్కల తొలగింపునకు మాత్రం ఆ శాఖ అధికారులు దృష్టి సారించిన దాఖలాలు కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. కాలు వలలో పిచ్చి మొక్కలు పెరిగి ప్రధాన కాలువ నుంచి ఎన్ని నీళ్లు వదిలినా ప్రధాన కాలువకు సమీప ప్రాంతాల రైతుల పంట పొలాలకు మాత్రమే నీరు అందుతోంది. చివరి ఆయకట్టు రైతులు ఎప్పుడూ పంటలు ఎండబెట్టుకునే పరిస్థితులే ఉన్నాయంటూ వాపోతున్నారు.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు కాలువల మరమ్మతులతో పాటు పిచ్చి మొక్కల తొలగింపునకు చర్యలు చేపట్టి చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందేలా చర్యలు చేపట్టాలని మండల రైతులు కోరుతున్నారు.



పెగడపల్లి శివారులో కాలువలో నిండిన మట్టి

వర్గీకరణను మాలలంతా ఐక్యంగా తిప్పికొట్టాలి

- జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్
- సిరిసిల్లకు చేరుకున్న మాలల మహా పాద్రయాత్ర



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్

సిరిసిల్ల టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణను మానుకోవాలని, వర్గీకరణను మాలలంతా ఐక్యంగా తిప్పికొట్టాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. అక్టోబరు 25న భద్రాచలంలో ప్రారంభించిన మాలల మహా పాదయాత్ర మంగళవారం సిరిసిల్ల పట్టణానికి చేరకుంది. మాలమహానాడు జిల్లా, పట్టణ, మండలాల నాయకులు పాదయాత్ర చేస్తున్న పిల్లి సుధాకర్, నాయకులకు ఘన స్వాగతం పలికారు. స్థానిక రగుడు నుంచి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వరకు పాదయాత్ర సాగింది. అంబేద్కర్ విగ్రహానికి సుధాకర్, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ మంత్రి సుద్దాల దేవయ్య మాలల మహా పాదయాత్రకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడారు. మాదిగల కంచంలోని అన్నంను, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలను గుంజుకుంటున్నామని అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగంతో సంబంధం లేకుండా దొడ్డిదారిలో నరేంద్రమోదీ సుప్రీం కోర్టు ద్వారా రాష్ట్రాలకు వర్గీకరణ చేసుకునే విధంగా వెసులబాటు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. మనువాదుల చెరలోకి మందకృష్ణ మాదిగ చేరాడని ఆరోపించారు. దళితులను మనువాదులు హింసలకు, మహిళలపై దాడులకు గురిచేస్తూంటే మనువాదుల మోచేతుల నీళ్లు తాగుతున్న మందకృష్ణమాదిగకు కనబడడం లేదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం రావాలని మాలలు మొత్తం కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం తిరగారన్నారు. మాలలను మరిచిపోయి ఒక కులానికి కొమ్ము కాయడం సరికాదన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు తుంగ శివరాజు, జిల్లా నాయకులు రెంజర్ల రాజేష్, మేడి అంజయ్య, నాలుక సత్యం, జక్కుల యాదగిరి, రొడ్డ రాంచంద్రం, ఎడ్ల సందీప్, వివిధ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

బస్సులు లేక ప్రయాణికుల ఇబ్బందులు



రోడ్డుమీదకు ఎక్కి నిరసన తెలుపుతున్న ప్రయాణికులు

వేములవాడ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ ఆర్టీసీ బస్టాండులో బస్సులు లేక భక్తులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భక్తులు సోమవారం రాజన్నను దర్శించుకుని మంగళవారం బద్దిపోచమ్మ అమ్మవారికి బోనాలు తీసి వెళ్లడం ఆనవాయితీగా వస్తుంది. ఈ క్రమంలో మంగళవారం రాజన్న భక్తులతో పాటుగా, ప్రయాణికులు ఆర్టీసీ బస్టాండుకు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. దీంతో బస్టాండులో బస్సులు లేకపోవడంతో గంటలపాటు నిరీక్షించిన భక్తులు సహనాన్ని కోల్పోయి రోడ్డుపైకి వెళ్లి వచ్చే బస్సులను అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రయాణికులకు నచ్చజెప్పి ఒప్పించారు. దీంతో ప్రయాణికులు శాంతించారు.

చిన్నబోతున్న పర్యాటకం

- ప్రారంభోత్సవానికే పరిమితమైన మిడ్ మానేరు జల విహారం
- కార్మిక, ఆధ్యాత్మిక క్షేత్రానికి.. పర్యాటక సొబగులు దూరమేనా?
- జిల్లాలో మిడ్‌మానేరు, అనంతగిరి ప్రాజెక్ట్‌ల వద్ద ప్రతిపాదనలు
- అనంతగిరి ప్రాజెక్ట్‌లో 40 ఎకరాల్లో ఐలాండ్
- నేడు సిరిసిల్ల జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

కార్మిక, ఆధ్యాత్మిక జిల్లాగా రాజన్న సిరిసిల్ల నిలుస్తుంది. జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నా నేతల హామీలు, పరిశీలనలకే పరిమితవుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కరకట్ట వద్ద అప్పటి మంత్రులు హడావుడిగా బోటు ప్రారంభించి జల విహారానికి నాంది పలికగా ప్రారంభోత్సవంతోనే నిలిచి పోయింది. దాదాపు మూడు సంవత్సరాలుగా సిరిసిల్ల ప్రజలు జలవిహారానికి ఎదురు చూసినా నిరాశే మిగిలింది. ప్రారంభించిన బోట్లు ఇప్పటికీ కరకట్ట వద్ద వెక్కిరిస్తూ కనిపిస్తున్నాయి. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు, అన్నపూర్ణ ప్రాజెక్ట్ వద్ద పర్యాటక రంగంవైపు చూస్తారని ఆశగా ప్రజలు ఎదురుచూస్తున్నారు.


పర్యాటకానికి రెండు ప్రాజెక్ట్‌లు కీలకం...

జిల్లాలోని మిడ్‌మానేరు, అన్నపూర్ణ రెండు ప్రాజెక్ట్‌లు పర్యాటకానికి కీలకంగా మారుతాయని భావించారు. వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆధ్యాత్మికతకు పర్యాటకం తోడవుతుందని అనుకున్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకాలకు సిరిసిల్ల మానేరు తీరంలోని శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్, అన్నపూర్ణ అనంతగిరి ప్రాజెక్ట్‌లు ప్రధానంగా నిలుస్తాయి. ఈ ప్రాజెక్ట్‌ల వద్ద పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని 2021 జూలై 4న సిరిసిల్ల జిల్లా పర్యటనకు వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అనంతగిరి పోచమ్మను దర్శించుకుంటానని అన్నపూర్ణ అనంతగిరి, శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్‌లను పర్యాటక అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని ప్రకటించారు. వేములవాడ ఆధ్యాత్మికతకు స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు పర్యాటకం కూడా స్వాగతం పలుకుతుందని భావించినా ఆచరణలోకి మాత్రం రాలేదు. గత ప్రభుత్వ హయాంలో పలుమార్లు రెండు ప్రాజెక్ట్‌ల వద్ద పర్యాటక పరిశీలనలు జరిగాయి. మిడ్ మానేరు వద్ద కొడుముంజ గుట్టలకు కలుపుకొని రోప్‌వేలు కాటేజీల నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు. అదే క్రమంలో మిడ్ మానేరు బ్యాక్ వాటర్ సిరిసిల్ల కరకట్ట వద్ద బోటును కూడా సిద్ధం చేసినా కొవిడ్‌తో ప్రారంభానికి నోచుకోలేదు. శాసనసభ ఎన్నికల క్రమంలో గత సంవత్సరం ఆగస్టు 18న హడావుడిగా ప్రారంభోత్సవం చేసి వదిలేశారు. రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు మిడ్ మానేరులోని అందాలను చూసే విధంగా విహరించే అవకాశం అందుబాటులోకి వస్తుందని అనుకున్నా నిరాశే మిగిలింది.

ఐలాండ్ అభివృద్ధికి మోక్షం కలిగేనా...



ఇల్లంతకుంట మండలం అనంతగిరి వద్ద గుట్టలను అనుసంధానం చేస్తూ అన్నపూర్ణ, అనంతగిరి ప్రాజెక్ట్‌ను నిర్మించారు. ఇక్కడే ఆసియాలోనే అతి పెద్ద సర్జిపూల్ బావిని కూడా నిర్మించారు. ప్రాజెక్ట్‌లో మధ్యలో ఉన్న 40 ఎకరాలతో ఉన్న గుట్టను ఐలాండ్‌గా తీర్చిదిద్దాలని నిర్ణయించినా ప్రతిపాదనలకు మోక్షం కలగడం లేదు. ప్రాజెక్ట్ వద్ద పోచమ్మ తల్లి దేవాలయం కూడా ఉంది. పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ఇక్కడికి వచ్చే పర్యాటకులు, యాత్రికులకు ప్రాజెక్ట్ ఎంతో ఆహ్లాదాన్ని పంచుతుందని భావిస్తున్నారు. జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి తెలంగాణలోని అన్ని జిల్లాలతో పాటు పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు ప్రతీయేడు లక్షల సంఖ్యలో వచ్చిపోతుంటారు. మిడ్ మానేరు, అనంతగిరి ప్రాజెక్ట్‌లను పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని గత ప్రభుత్వం భావించింది. మిడ్ మానేరు ప్రాజెక్ట్ వద్ద బోటింగ్‌తో పాటు అడ్వెంచర్ పార్కు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జిల్లాకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యాటక అభివృద్ధికి బాటలు వేయాలని ఈ ప్రాంతావాసులు కోరుకుంటున్నారు.



అన్నపూర్ణ ప్రాజెక్ట్‌లో బోటు

బకాయిలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రమేష్

భగత్‌నగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యా రంగ బకాయిలు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలో ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలు బంద్ చేస్తే విద్యార్థుల చదువులు ఎలా సాగుతున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చి 11 నెలలు గడుస్తున్నా పెండింగ్ ఫీజు బకాయిలు ఇవ్వకపోవడం సరి కాదన్నారు. రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, నగర నాయకులురవి, రమేష్, రాజు, క్రాంతి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

24న ఉమ్మడి జిల్లా సీనియర్స్ ఖో-ఖో జట్ల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా సీనియర్స్ పురుషులు, మహిళల ఖో-ఖో జట్ల ఎంపిక పోటీలను ఈ నెల 24న నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఉదయం 9:30 గంటల నుంచి ఈ పోటీలను నిర్వహించనున్నామని జిల్లా ఖో- ఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై మహేందర్‌రావు తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారులను వరంగల్ జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి సీనియర్స్ మహిళలు, పురుషుల ఖో-ఖో పోటీలకు ఉమ్మడి జిల్లా జట్లను ఎంపిక చేయనున్నామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 9:30 గంటలకు అంబేద్కర్ స్టేడియంలో ఒరిజినల్ ఆధార్ కార్డు, అలాగే ఒక జిరాక్స్, ఒక ఫొటోతో హాజరు కావాలని పేర్కొన్నారు.

నియంతృత్వ ధోరణి అవలంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

- 21న లగచర్లకు వామపక్షనాయకులతో కలిసి వెళ్తాం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

సిరిసిల్ల నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నియంతృత్వ ధోరణి అవలంభిస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మంగళవారం సీపీఐ జిల్లా మూడవ మహాసభల సందర్భంగా స్థానిక ఆర్డీవో కార్యాలయం నుంచి పట్టణంలోని బీవైనగర్ షాదీఖానా వరకు ఎర్రజెండాలు చేతబూని ప్రధాన వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు.



సీపీఎం జెండాను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

అనంతరం జరిగిన బహిరంగ సభలో తమ్మినేని మాట్లాడారు. రాష్ట్రంలో చేపట్టే పనులపై అఖిలపక్షం నాయకులతో చర్చలు జరపకుండా నియంతృత్వ ధోరణికి పాల్పడుతున్నారని అన్నారు. మూసీ నది ఒడ్డున ఉన్న ఇళ్లకు బదులుగా వారికి ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వడంతోపాటు వారికి ప్రతీనెల 15 వేల రూపాయలను అందించి వారిని ఆదుకోవాలన్నారు.

గత ప్రభుత్వం ఫార్మాసిటీకి హైదరాబాద్ శివారులో 13వేల ఎకరాలను తీసుకున్నారని అక్కడ దానిని నిర్మించకుండా సీఎం నియోజకవర్గంలోని లగచర్లలో 10వేల ఎకరాల భూములను తీసుకోవడం సరైందికాద న్నారు. ఇటీవల అ గ్రామానికి వెళ్లిన జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా అధికారులపై దాడులు చేసిన వారిలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారిని అరెస్ట్ చేసి కాంగ్రెస్ పార్టీ నాయకులను వదిలివేయడం సరైంది కాదన్నారు. పోలీసులు లగచర్ల గ్రామానికి ఎవరి రానీయకుండా చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. ఈ నెల 21వ తేదీన వామపక్షాల పార్టీ నాయకులతో తాను లగచర్ల గ్రామానికి వెళ్లి అక్కడి రైతులు, ప్రజలతో మాట్లాతానని మమ్ములను ఎవరు అడ్డుకుంటురో చూ స్తామన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కమ్యూనిస్ట్ ఉద్యమం బలహీనంగా ఉన్నప్పటికీ బలమైన పోరాటం నిర్మించిందని అన్నారు.



ముఖ్యమంత్రి బుధవారం జిల్లా పర్యటనకు వస్తున్న సందర్భంగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి నేతన్నలకు ఉపాధి కల్పించేలా ప్రభుత్వ అర్డర్లను ప్రకటించి తన చిత్తశుద్ధిని ప్రదర్శించాలనిన్నారు. కేంద్రంలోని బీజేపీ హిందుత్వ సిద్ధాంతం కేవలం అదానీ, అంబానీ వం టి అగ్రవర్ణాల ప్రయోజనాల కోసమని అసలైన హిందువులకు మేలు జరగదని వివరించారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, రాష్ట్ర కమిటీ సభ్యులు స్కైలాబ్‌బాబు, కూరపాటి రమేష్, జిల్లా కార్యదర్శి మూషం రమేష్, నాయకులు కోడం రమణ, ఎగమంటి ఎల్లారెడ్డి, విమల, గన్నేరం నర్సయ్య, మల్లారపు అరుణ్‌కుమార్, ఎరవెల్లి నాగరాజుపాల్గొన్నారు.

కొండగట్టులో భక్తుల సందడి

మల్యాల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామిని సన్నిధానం మంగళవారం వేలాదిగా తరలివచ్చిన భక్తులతో సందడిగా మారింది. కొండపైకి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. వేకువజాము నుంచే వందలాది వాహనాలు, కాలినడకన కొండపైకి చేరుకున్న భక్తులు అంజన్నకు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు జరిపారు. మహిళ భక్తులు ఆలయం ముందు గల రావి చెట్టు వద్ద దీపాలు వెలిగించి కార్తీక పూజలు చేశారు. కరీంనగర్ జిల్లా జడ్జి ప్రతిమ అంజన్నను దర్శించుకున్నారు. కొండపైన భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ తదితరులు భక్తుల రద్దీని పర్యవేక్షించారు.



కొండగట్టు ఆలయం వద్ద భక్తులు

ధర్మపురిలో కార్తీక భక్తుల రద్దీ

- ఉసిరిక చెట్టు వద్ద దీపాలు వెలిగించిన మహిళలు

ధర్మపురి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో కార్తీక భక్తుల రద్దీ మంగళవారం పెరిగింది. క్షేత్రానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. స్థానిక శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. గోదావరి నదిలో భక్తులు కార్తీక స్నానాలు ఆచరించారు. నదిలో కార్తీక దీపాలు వదిలారు. భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.. నరసింహుడి ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కళ్యాణం జరిపించి పూజలు చేశారు. ఆలయం ఆవరణలో గల ఉసిరిక చెట్టు చుట్టు ప్రదక్షిణాలు చేసి, లక్ష వత్తులు వెలిగించి, కార్తీక దామోదరుడిని పూజించారు. మహిళలు దీపాలు, వత్తులు వెలిగించి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్వామి వారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, అర్చకులు, నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు.



గోదావరి నది వద్ద హారతి పూజలు

18 వ రోజు ఘనంగా గోదావరి హారతి

కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి 18వ రోజు మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు, మహిళలు గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్ఛారణల మధ్య అర్చకులు లోక క్షేమం కోసం, విశ్వశాంతి కోసం విశేష పూజలు జరిపారు. నదీ మాతకు హారతి ఇచ్చి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, వేదపండితులు పాలెపు ప్రవీణ్‌శర్మ, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక కార్తీక దీపోత్సవం

- కార్తీక దీపాలు వెలిగించిన భక్తులు
- ఆకట్టుకున్న చిన్నారులు నృత్యాలు

వేములవాడ కల్చరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి క్షేత్రంలో నిర్వహిస్తున్న సామూహిక కార్తీక దీపోత్సవం వైభవంగా కొనసాగుతోంది. రాజన్న ఆలయంలోని కళాభవన్‌లో ఏర్పాటు చేసిన కార్తీక దీపోత్సవం కార్యక్రమానికి మంగళవారం భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. అనంతరం తీరొక్కపూలతో పలు ఆకృతుల్లో అందంగా దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. కాగా నిజామాబాద్‌కు చెందిన సిద్ధార్థ కళాక్షేత్రం ఆంధ్ర నాట్యము జయలక్ష్మి బృందం చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ముఖ్య అర్చకులు దుమాల నాగరాజుశర్మ, వెంకటయ్య, కృపాల్ తదితరులు ఉన్నారు.



సామూహిక కార్తీక దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు



కార్తీక సామూహిక దీపోత్సవంలో నృత్యం చేస్తున్న చిన్నారులు

అర్హులు బీమా నమోదు చేయించుకోవాలి

జిల్లా లీడ్‌బ్యాంక్ ఎఫ్ఎల్సీ కోట మధుసూదన్

జగిత్యాలరూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతి ఒక్కరు బీమా నమోదు చేసుకోవాలని లీడ్‌బ్యాంక్ ఎఫ్ఎల్సీ కోట మధుసూధన్ అన్నారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలంలోని తక్కళ్లపల్లి గ్రామంలో ప్రధాన మంత్రి జీవనజ్యోతి, బీమాయోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజనపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ జిల్లా పరిధిలో 18 ఏళ్ల నుంచి 70 ఏళ్ల మధ్య కల్గిన ప్రతి ఒక్కరు బీమా చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పుష్ప, వీవోఏ లత, బీసీ పాయింట్ నిర్వాహకురాలు సిద్దు, సతీష్‌రెడ్డి, మ హిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

మల్లాపూర్, నవంబరు, 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వాల్గొండ గ్రామంలోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచి ఆలయంలోని స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం స్వామి వారి కల్యాణం, హోమం వంటి తదితర కార్యక్రమాలు వేదపండితుడు రాజశేఖర్‌చారి వేదమంత్రోత్సవాల మధ్య వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యంలో పాల్గొన్న భక్తులు స్వామి వారి కల్యాణం తిలకించినంతరం దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు, సభ్యులు, భక్తులు, పాల్గొన్నారు.



వాల్గొండలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం జరుపుతున్న భక్తులు

సంక్షిప్త సమాచారం

ఇల్లంతకుంట (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వాణీనికేతన్ హైస్కూల్‌లో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా జరిగింది. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠ్యాంశాలను బోధించారు. ఉత్తమంగా బోధించిన వారికి బహుమతులు అందించారు.

- అనుభావిత్మిక కార్యక్రమం అయిన ప్రేరణలో మండలంలోని వంతడుపుల గ్రామానికి చెందిన కట్కూరి దివ్య ప్రతిభ కనబర్చింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించిన వికసిత భారత్ కార్యక్రమంలో భాగంగా దివ్య రాష్ట్రస్థాయిలో ఉత్తమంగా నిలిచింది. 10 రాష్ట్రాల విద్యార్థులకు గుజరాత్ రాష్ట్రంలోని వాద్‌నగర్‌లో వారం రోజులపాటు శిక్షణ పొందింది. రహీంఖాన్‌పేటలోని ఆదర్శ పాఠశాలలో చదువుతున్న దివ్యకు గైడ్‌టీచర్‌గా జీశ వ్యవహరించారు.

ఎల్లారెడ్డిపేట (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న కోడిగుడ్లు అందించడం లేదని ప్రశ్నిస్తే అరెస్ట్ చేయడం అన్యాయమని ఎస్‌ఏపీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామంలో ఇటీవల పోలీసులు అరెస్ట్ చేసిన వ్యక్తి బెస్త నరేశ్ కుటుంబ సభ్యులను మంగళవారం ఆయన పరామర్శించారు.

- విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలని హెచ్‌ఎం మనోహరాచారి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివి పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రాణహిత ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహకాలను అందజేశారు.

- హన్మకొండలో నిర్వహించిన ప్రజా పాలన విజయోత్సవం, ఇందిరా మహిళ శక్తి సంబరాలకు ఎల్లారెడ్డిపేట మండల సమాఖ్య ఆధ్వర్యంలోని 45 మంది మహిళ సంఘం ప్రతినిధులు బస్సులో తరలివెళ్లారు.

సిరిసిల్ల రూరల్ (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బీడి కార్మిక నాయకుడిగా పోరాటాలు చేస్తున్న సీఐటీయూ జిల్లా నాయకుడు మోర అజయ్ మంగళవారం బీఎల్‌టీయూ యూనియన్‌లో చేరినట్లు బీఎల్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి సిద్దిరాములు ప్రకటించారు.

- సిరిసిల్ల పట్టణంలోని సెస్ ప్రభుత్వ బాలిక జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ జాతీయ సమైక్యత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

సిరిసిల్ల టౌన్ (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నాయకులు వ్యక్తిగత విమర్శలు చేయడం మానుకోవాలని మాజీ సర్పంచ్ మాట్ల మధు అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

- సిరిసిల్ల పట్టణంలో జేఎన్టీయూ భవన నిర్మాణ పనులకు సీఎం రేవంత్‌రెడ్డి నిధులను కేటాయించాకే రాజన్న సిరిసిల్ల జిల్లాకు రావాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీష్ అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

- పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం మిడ్ మానేరు నిర్వాసితులకు ఏమిచేయలేదని ఇచ్చిన హామీ మేర భూనిర్వాసితులకు ఇళ్లు, డబ్బులు మంజూ చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్‌ఎస్ నాయకులకు లేదని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ అన్నారు. మంగళవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

తంగళ్లపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని సారంపల్లిలో లబ్ధిదారుడు ఇమ్మినేని లింగారావుకు రూ 60 వేలు సీఎంఆర్‌ఎఫ్ చెక్కును కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మునిగేలా రాజు అందజేశారు.

చందుర్తి (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడపల్లికి చెందిన నక్క కేతవ్వ, నీరటి ప్రసాద్, పుల్కం లక్ష్మి, వట్టిమల్ల శరత్ కుమార్ అనే లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు బాణాల రవీందర్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు సంటి ఏసుదాస్‌లు మంగళవారం చెక్కులను పంపిణీ చేశారు.

వస్త్ర పరిశ్రమపై వరాలు కురిసేనా?

(5వ పేజీ తరువాయి)

చీరలపై పలు ఆరోపణలు ఉన్నప్పటికి కార్మికులకు మాత్రం చేతి నిండాపని, కడుపు నిండా తిండి అన్నట్లుగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత బతుకమ్మ చీరల ఆర్డర్లను నిలిపివేసింది. ఈ పరిస్థితుల్లో గత మార్కెట్‌ను కోల్పోయిన సిరిసిల్ల మరమగ్గాల పరిశ్రమ ఉత్పత్తులు లేక మూతపడ్డాయి. ఈ పరిస్థితుల్లో మరమగ్గాలను అమ్ముకున్నారు. సంక్షోభంలో కూరుకుపోయిన వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలని కార్మిక సంఘాలు, కార్మికులు రోడ్డునెక్కారు. దీంతో ప్రభుత్వం పరిశ్రమను ఆదుకునే దిశగా చర్యలు చేపట్టింది. సిరిసిల్లకు రావాల్సిన రూ 275 కోట్లలో రూ 200 కోట్లు విడుదల చేశారు. తాత్కాలికంగా విద్యార్థులకు అవసరమయ్యే యూనిఫాం బట్ట ఉత్పత్తుల ఆర్డర్లను అందించారు. బతుకమ్మ చీరల తరహాలో స్వశక్తి సంఘాల మహిళలకు 1.30 కోట్ల చీరలు అందించడానికి నిర్ణయించారు. డిజైన్లు ఖరారు చేసినా ఆర్డర్లు అందించలేదు. దీంతో పాటు 50 శాతం సబ్సిడీతో పది హెచ్‌పీల వరకు ఉన్న రాయితీని 25 హెచ్‌పీలకు పెంచారు. దీంతో పరిశ్రమలో మళ్లీ ఉపాధి ఆశలు మెరుగుపడుతాయని భావిస్తున్నారు. 50 కోట్ల రూపాయలతో వేములవాడలో ముఖ్యమంత్రి ప్రారంభించబోతున్న యారన్ డిపో ఊరటను ఇవ్వనుంది.

● ఎదురుచూపుల్లోనే వర్కర్ టు ఓనర్ పథకం ..

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సిరిసిల్ల కార్మికులను యజమానులుగా మార్చడానికి వర్కర్ టు ఓనర్ పథకానికి శ్రీకారం చుట్టారు. మహిళలకు గార్మెంట్ రంగంలో ఉపాధి కల్పించడానికి అపెరల్ పార్కు ఏర్పాటు చేశారు. అపెరల్ పార్కులో బహుళ జాతి కంపెనీలు ఉత్పత్తులు ప్రారంభించడంతో మహిళలకు ఉపాధి చేరువైన మరమగ్గాల కార్మికులు వర్కర్ టు ఓనర్ పథకం కోసం ఎదురుచూస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం మున్సిపల్ పరిధిలోని పెద్దూర్ వద్ద 88 ఎకరాల్లో 374 కోట్ల రూపాయలతో వీవింగ్ పార్కు నిర్మాణాలు చేపట్టారు. మొదటి విడతలో 1,104 మంది కార్మికులకు వర్క్‌షెడ్లను నిర్మించి అందించాలనే లక్ష్యంగా పనులు ప్రారంభించారు. రోడ్లు, నీటి వసతి, కరెంట్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించారు. 46 వర్క్‌షెడ్లను నిర్మించాలనే లక్ష్యంగా పెట్టుకొని నిర్మాణాలు చేపట్టారు. వర్క్ షెడ్లు పూర్తి చేశారు. మోడల్ కోసం మరమగ్గాలను ఏర్పాటు చేశారు. వర్కర్ టు ఓనర్ పథకంలో మొదటి విడతలో 4,416 మరమగ్గాలను గ్రూప్ షెడ్ల కింద అందించాలని నిర్ణయించారు. ఒక్కో కార్మికుడికి 800 చదరపు అడుగుల్లో స్టోర్‌రూంతో కలిపి కేటాయించనున్నారు. ఇందులో నాలుగు సెమీ ఆటోమేటిక్ మరమగ్గాలు, కండెలు చుట్టే యంత్రం ఇస్తారు. పార్కులో 60 వార్పిన్ మిషన్లు కూడా ఏర్పాటు చేస్తారు. ఒక్కో యూనిట్ ధర ఎనిమిది లక్షల రూపాయలుగా ముందుగా నిర్ణయించారు. ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణం గా 15 లక్షల రూపాయల వరకు చేరుకునే అవకాశం ఉంది. ఇందులో పది శాతం లబ్ధిదారుడి వాటాధనం, 50 శాతం ప్రభుత్వ రాయితీ, 40 శాతం బ్యాంక్ రుణం ఉండే విధంగా పథకం ఏర్పాటు చేశారు. మరమగ్గాల ఎంపిక కోసం తాత్కాలికంగా నాలుగు ఆటోమేటిక్ మగ్గాలను కూడా పార్కులో ఉంచారు. విభిన్నమైన వస్త్రాలను ఇందులో తయారు చేసే అవకాశం ఉంటుంది. కానీ నేత కార్మికులను యజమానులుగా మార్చే పథకం చేరువ కాబోతుందని భావిస్తున్న క్రమంలో ప్రభుత్వం మారిపోయింది. వర్కర్ టు ఓనర్ విధి విధానాల్లో మార్పులు వస్తాయా లేదా పథకమే ఉంటుందా లేదా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వం ఏర్పడి పది నెలలు గడిచిపోయినా వర్కర్‌టు ఓనర్ పథకంపై ప్రభుత్వ నిర్ణయం తేలకపోవడంతో నేత కుటుంబాల్లో సందిగ్ధం నెలకొంది. మరోవైపు పూర్తయిన షెడ్లు ఇతర అవసరాలకు కేటాయిస్తుండడంతో వర్కర్ టు ఓనర్ పథకం దూరమవుతుందనే భావన కార్మికుల్లో నెలకొంది. ముఖ్యమంత్రి కార్మికులకు మళ్లీ భరోసాను ఇచ్చే ప్రకటనలు చేస్తారనే ఆశతో ఉన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలో వెనకబడిన వేములవాడ

- రాజన్న ఆలయానికి కాంగ్రెస్‌తో మహర్దశ - ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



. సీఎం సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఆది

వేములవాడకల్చరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో యువరాజుగా వున్న అప్పటి మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ఆధ్వర్యంలో వేములవాడ వెనుకబడి పోయిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆరోపించారు. నేడు సీఎం రేవంత్ పర్యటన నేపథ్యంలో మంగళవారం రోజున సభ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆది శ్రీనివాస్ మాట్లాడారు. పదేళ్ల అధికారంలో వున్న కేసీఆర్ ప్రభుత్వం రాజన్న ఆలయానికి చేసింది ఏమిలేదని అన్నారు. వేములవాడ ఎందుకు వెనుకబడిందో పీసీసీ అధ్యక్ష హోదాలో ఉన్న రేవంత్‌రెడ్డిని వేములవాడకు తీసుకు వచ్చి వివరించానని తెలిపారు. సీఎం హోదాలో మొదటిసారిగా రాజన్న ఆలయానికి రేవంత్‌రెడ్డి వస్తున్నాడన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఇప్పటి వరకు నిధుల వరద వచ్చిందని అన్నారు. రాబోయే రోజుల్లో వేములవాడ, రాజన్న సిరిసిల్ల జిల్లా అభివృద్ధిలో దూసుకుపోతుందని అన్నారు. గత ప్రభుత్వాలు అభివృద్ధిలో విఫలమైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలకు మించి నిధులు వచ్చాయని దీంతో ఈ ప్రాంత ప్రజల గుండెల్లో సీఎం చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు భారీ సంఖ్యలో జనం తరలివచ్చి కృతజ్ఞత తెలపాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

మృతుల కుటుంబీకులకు చెక్కుల అందజేత

ఇల్లంతకుంట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు సెస్ చైర్మన్ చిక్కాల రామారావు చెక్కులను అందజేశారు. మండల కేంద్రం చెందిన రంగు రమేష్, అనంతగిరి గ్రామానికి చెందిన ఒగ్గరి మహేష్‌లు కొద్ది నెలల క్రితం విద్యుదాఘాతంతో మృతి చెందారు. మంగళవారం సెస్ కార్యాలయంలో కుటుంబీకులకు ఒక్కొక్కరికి ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాలు జరగకుండా వినియోగదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ మల్లుగారి రవీందర్ రెడ్డి, ఏడీఈ శ్రీనివాస్, ఏఈ నగేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్య స్థాపనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



ఇందిరాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

ఇల్లంతకుంట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ రాజ్యస్థాపనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో కాంగ్రెస్ నాయకులు అంతగిరి బాలపోచయ్య సహకారంతో ఏర్పాటు చేసిన ఇందిరాగాంధీ విగ్రహాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతు గత ప్రభుత్వ హయాంలో నిర్బంధాల మధ్య ఇందిరాగాంధీ విగ్రహాలను ఆవిష్కరించుకున్నామని తెలిపారు. ఇందిరాగాంధీ పరిపాలన కాలంలో భూమి, ఇళ్లులేని వారికి అండగా నిలిచిన ఘనత దక్కిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరుతున్నాయని అన్నారు. మానకొండూర్ నియోజకవర్గ అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్నామని, అందులో భాగంగా విద్య, వైద్యారంగానికి ప్రాధాన్యత ఇస్తున్న ట్లు పేర్కొన్నారు. తొలుత మహరాజుల కాలనీ నుంచి బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకురాలు డాక్టర్ కవ్వంపల్లి అనురాధ, మండలశాఖ అధ్యక్షుడు రాఘవరెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ ఐరెడ్డి చైతన్యమహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు రమణారెడ్డి, అయిలయ్య, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్, అధికార ప్రతినిధి పసుల వెంకటి, నాయకులు ప్రసాద్, ఆనందరెడ్డి, బాలపోచయ్య, చల్ల నారాయణ, అమరేందర్, రమేష్, రాజేశం, నరేష్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా బందోబస్తు విధులు నిర్వర్తించాలి: ఎస్పీ



సిబ్బందికి దిశా నిర్దేశం చేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

వేములవాడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభ సందర్భంగా అప్రమత్తంగా బందోబస్తు విధులు నిర్వర్తించాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ పోలీసు సిబ్బందికి సూచించారు. బుధవారం నాడు వేములవాడలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటించనున్న నేపథ్యంలో బందోబస్తు విధుల్లో పాల్గొననున్న పోలీసు సిబ్బందికి మంగళవారం నాడు వేములవాడ పట్టణం పోలీస్‌స్టేషన్ ఆవరణలో దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా 1100 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. బందోబస్తును సెక్టార్ల వారీగా విభజించి అడిషనల్ ఎస్పీ, డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులను బాధ్యులుగా నియమించామన్నారు. బందోబస్తుకు వచ్చిన పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు. సిబ్బంది అందరూ ఐడీ కార్డులను తప్పనిసరిగా ధరిస్తూ తమకు కేటాయించిన విధులను పూర్తి అప్రమత్తతో విధులు నిర్వహించాలని సూచించారు.

హెలికాప్టర్ వద్ద విధులు నిర్వహించేవారు అప్రమత్తంగా ఉండాలని హెలికాప్టర్ వద్దకు ఎవరినీ రానివ్వకూడదని సూచించారు. ప్రతీ అధికారి బందోబస్తు కేటాయించిన ప్రాంతంపై, చేయవలసిన డ్యూటీ గురించి పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని అన్నారు. తమకు కేటాయించిన ప్రాంతాన్ని ఎవరు ఎట్టి పరిస్థితుల్లో వదిలి వెళ్లకూడదని, డ్యూటీ పరంగా లేదా ఏదైనా సందేహం ఉంటే సంబంధిత అధికారులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. సమావేశంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, జిల్లా పోలీస్ అధికారులు, వివిధ జిల్లాల నుండి వచ్చిన పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలి

కోనరావుపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రైతులకు డీలర్లు నాణ్యమైన విత్తనాలను అందించాలని మండల వ్యవసాయ అధికారి సందీప్ అన్నారు. మండలంలోని నిజామాబాద్ రైతు వేదికలో రైతులకు, ఫర్టిలైజర్ డీలర్లకు రబీ సీజన్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో విత్తన రకం విత్తన గడువు చూసుకోవాలని అన్నారు. బిల్లులు పంటకాలం అయిపోయే వరకు జాగ్రత్తగా భద్రపరచుకోవాలని అన్నారు. ప్రతి షాపులో విత్తనాల ధరలు, స్టాకు సంబంధించిన బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఏఈవోలు రమేష్, హేమాజీ, పద్మ, స్రవంతి, సహజ, శ్వేత, డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

రుద్రంగికి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ మంజూరు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

రుద్రంగి నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)ను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏటీసీలో పలు రంగాల్లో యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు సాధించేలా శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సెంటర్‌లో రెండేళ్ల కాలపరిమితి కలిగిన ఆరు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కోర్సులు ఉండనున్నాయి. అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మిషనింగ్ టెక్నీషియన్ 48, ఆర్టీసియన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్ 20, బేసిక్ డిజైనర్, వర్చువల్ వెరిఫయర్ 48, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నిషియన్ 40, మెకానిక్ ఎలక్ట్రానిక్ వెహికల్ 48, మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్ 40 సీట్లు అందుబాటులో ఉండనున్నాయి. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లో చదువుకొని విదేశాలకి వెళ్లే వారికి తప్పనిసరిగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేస్తున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను రుద్రంగిలో ఏర్పాటు చేయడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. టెక్నాలజీ సెంటర్ మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృషి చేసిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు గ్రామస్థులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

వేములవాడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ పూర్తి చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వేములవాడ పర్యటన నేపథ్యంలో మంగళవారం నాడు వారు విలేకరులతో మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులను పూర్తిచేయాలన్నారు. జగిత్యాల బస్టాండ్ సమీపంలో దాదాపు 20 ఎకరాల స్థలంలో నూతన బస్టాండ్ కోసం ఆనాటి ప్రభుత్వం గెజిట్‌ను విడుదల చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం భూ సేకరణ చేసి పెండింగ్ లో ఉన్న నూతన బస్టాండ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో పూర్తి చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని, పెండింగ్ లో ఉన్న పనులు పూర్తి చేసే విధంగా కాంట్రాక్టర్లను ఆహ్వానించాలని కోరారు. రైల్వేలైన్ భూ సేకరణపై స్పష్టత ఇవ్వాలని, నిర్వాసితులకు తగిన పరిహారం చెల్లించి న్యాయం చేయాలని కోరారు. 11 నెలల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపల్‌కు నిధులు మంజూరు చేయలేదని, పట్టణ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి కందుల క్రాంతి కుమార్, కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, మారం కుమార్, గోలి మహేష్, నరాల శేఖర్, సిరిగిరి చందు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించండి

వేములవాడ కల్చరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయమైన నాంపల్లి లక్ష్మీ నృసింహస్వామి వారి ఆలయానికి నిధులు కేటాయించాలని నాంపల్లి గ్రామానికి చెందిన బొల్లం నాగరాజు విజ్ఞప్తి చేశారు. నిత్యం వేల సంఖ్యలో భక్తులు వస్తున్న నాంపల్లి గుట్టకు పర్యాటకుల సంఖ్యను మరింతగా పెంచేందుకు గత ప్రభుత్వం రోప్‌వే, ధర్మగుండం సుందరీకరణ, పనోరమ వ్యూతో పాటు పలు అభివృద్ధి పనులు చేస్తామని మొండిచెయ్యి చూపించిందని అన్నారు. సీఎం పర్యటనలో భాగంగా నాంపల్లి గుట్టకు సైతం నిధులు విడుదలయ్యేల ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

త్వరలో కేంద్రమంత్రితో బ్రిడ్జి ప్రారంభం



బ్రిడ్జిని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు, అధికారులు

గంభీరావుపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట-మల్లారెడ్డిపేట గ్రామాల మధ్య ఏడు కోట్ల 30 లక్షల రూపాయలతో నిర్మించిన నూతన వంతెనను త్వరలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ చేతుల మీదుగా ప్రారంభం చేస్తామని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి తెలిపారు. బీజేపీ నాయకులు మంగళవారం అధికారులతో కలిసి బిడ్జిని పరిశీలించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపి మాట్లాడుతూ ఈ బ్రిడ్జి నిర్మాణంతో ప్రాంత ప్రజలకు దూర భారం తగ్గుతుందన్నారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు గంట అశోక్, జిల్లా అధికార ప్రతినిధి ప్రసాద్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజేందర్‌రెడ్డి, గుర్రం నాగరాజుగౌడ్ ఉన్నారు.

అంగన్‌వాడీ టీచర్, ఆయాలను నియమించాలి

సిరిసిల్ల రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రానికి భవనం ఉన్న అందులో పనిచేయడానికి టీచర్‌తోపాటు ఆయాలు లేకపోవడంతో ఆసెంటర్ పరిధిలోని పిల్లలకు పౌష్టికాహారం అందడం లేదని వెంటనే పోస్టులను భర్తీ చేయాలని వార్డు కౌన్సిలర్ బోల్లం నాగరాజుగౌడ్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 10వ వార్డు చిన్నబోనాల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టులను భర్తీ చేయాలంటూ మంగళవారం పిల్లలు, తల్లిదండ్రులతో కలిసి కౌన్సిలర్ అంగన్‌వాడీ సెంటర్ ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. అంగన్‌వాడీ టీచర్‌తోపాటు ఆయా పోస్టులను భర్తీ చేయాలని లేకుంటే జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళనలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

సిరిసిల్ల టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వేములవాడ పర్యటనను విజయవంతం చేయాలని సిరిసిల్ల పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వెంకటరమణ విలేకరులతో మాట్లాడారు. వేములవాడ పట్టణంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు సిరిసిల్లకు చెందిన వస్త్ర పరిశ్రమ దాని అనుబంధ సంఘాలు, యజమానులు, నాయకులు, ఆసాములు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాలని సిరిసిల్ల పవర్‌లం వస్త్ర పరిశ్రమల ఐక్యవేదిక ద్వారా పిలుపునిస్తున్నామని అన్నారు. సమావేశంలో చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, పాలిస్టర్ అసోసియేషన్ కార్యదర్శి అంకారపు రవి, మ్యాక్స్ అసోసియేషన్ నాయకుడు పోలు శంకర్, ఆసాముల సంఘం అధ్యక్షుడు సిరిసిల్ల రవి, పద్మశాలి సంఘం కార్యదర్శి మండల సత్యం, చేనేత వస్త్ర వ్యాపార సంఘం ఉపాధ్యక్షుడు ఏనుగుల ఎల్లయ్య, పాలిస్టర్ అసోసియేషన్ నాయకుడు మండల బాలరాజు, ఆసాముల సంఘం కార్యదర్శి మండల రాజు, కాంగ్రెస్ చేనేత సెల్ జిల్లా అధ్యక్షు డు గోనే ఎల్లప్ప, పట్టణ అధ్యక్షుడు బండారి అశోక్ పాల్గొన్నారు.

గంభీరావుపేట (ఆంధ్రజ్యోతి): వేములవాడలో బుధవారం జరిగే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభను విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ పిలుపు నిచ్చారు. గంభీరావుపేటలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో హమీద్ మాట్లాడుతూ మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజలు, యువకులు మహిళలు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్‌తో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, సోషల్ మీడియా ఇంచార్జీ గౌరి శంకర్ ఉన్నారు.

రాజన్నను దర్శించుకున్న దేవాదాయ శాఖ కమిషనర్

వేములవాడ కల్చరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారిని దేవాదాయ శాఖ కమిషనర్, ఐఏఎస్ అధికారి శ్రీధర్ మంగళవారం దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో వినోద్‌రెడ్డి స్వామివారి శేషవస్త్రంతో సన్మానించి రాజన్న చిత్రపటంతో పాటు ప్రసాదాన్ని అందజేశారు. వారి వెంట డీసీ రామకృష్ణ రావు, ఈఈ రాజేష్ ఉన్నారు.

దేశం కోసం ప్రాణత్యాగం చేసిన ఇందిరా గాంధీ

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



వేములవాడలో ఇందిరా గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఆది శ్రీనివాస్



చందుర్తిలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేములవాడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం ప్రాణత్యాగం చేసిన ఉక్కు మహిళ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ అని వేములవాడ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఇందిరాగాంధీ జయంతి వేడుకలు వేములవాడ పట్టణంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సిరిసిల్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డితో కలిసి ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతే బడుగు బలహీన వర్గాల ఆత్మబంధువు ఇందిరమ్మ అన్నారు. ఆమె ఆశయ సాధనకు ప్రతి ఒక్కరం పాటు పడదామని, దేశానికి ఇందిరా గాంధీ చేసిన సేవలను నేటి తరానికి వివరించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, నాయకులు సాగరం వెంకటస్వామి, చిలుక రమేష్, కూరగాయల కొమురయ్య, పుల్కం రాజు తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల టౌన్ (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణం గాంధీచౌక్ వద్ద ఇందిరా గాంధీ చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, గ్రంథాలయం జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ, టీపీసీసీ సభ్యుడు సంగీతం శ్రీనివాస్, మార్కెట్ కమిటి చైర్‌పర్సన్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంగళ అశోక్ నాయకులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం, నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, రవీందర్, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, చిన్నలక్ష్మీ, రాజయ్య, గౌస్, శ్రీనివాస్‌రెడ్డి, రాజునాయక్, రఫీక్, శంకర్ పాల్గొన్నారు.

చందుర్తి (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జరిగిన వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, నాయకులు పులి సత్తయ్య, గొట్టె ప్రభాకర్, సంటి ఏసుదాసు, బాణాల రవీందర్‌రెడ్డి, పోతరాజు రవి, దెబ్బటి కిషన్, ప్రసాద్, రవి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఇందిరాగాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జల్గం ప్రవీణ్, నాయకులు నేరెళ్ల నర్సింగం, పెద్దురి తిరుపతి, మచ్చ శ్రీనివాస్, లింగాల భూపతి, మోర లక్ష్మీరాజం, మునిగల రాజు, గుగ్గిళ్ళ శ్రీకాంత్ గౌడ్, పొన్నాల పరుశరాములు, అసాని సత్యనారాయణ రెడ్డి, హారిక రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముస్తాబాద్ (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ అన్నం రాజేందర్‌రెడ్డి, పట్టణఅధ్యక్షుడు గజ్జెల రాజు పాల్గొన్నారు.

కోనరావుపేట (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, నాయకులు చేపూరి గంగాధర్, చందనగిరి గోపాల్, కచ్చకాయల ఎల్లయ్య, నందు గౌడ్, మండల నాయకులు నరసింహ చారి, రమేష్ రెడ్డి, మానుక సత్యం, పెంతల శ్రీనివాస్, సదానందం, లింబయ్య తదితరులు ఉన్నారు.

బోయినపల్లి (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్వహించిన ఇందిరా గాంధీ జయంతి వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వన్నెల రమణరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్‌యాదవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్‌రెడ్డి, సింగల్ విండో చైర్మన్ దుర్గారెడ్డి, మాజీ జడ్పీటీసీ పులి లక్ష్మీపతిగౌడ్, మాజీ ఎంపీపీ పర్లపెల్లి వేణుగోపాల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.